క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



సింహాచలం: అడవివరం లోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామిని అర్చించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ వార్షికోత్సవం



స్వామి సన్నిధిలో గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామివారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ స్థానిక పార్టీ నాయకులతో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆయన వెంట స్వామిని దర్శించుకున్నవారిలో పార్టీ నాయకులు యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్, గోతిరెడ్డి అమ్మతల్లి తదితరులు ఉన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో రుద్రాభిషేకం



స్వామి సన్నిధిలో మాలధారణ భక్తులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణ సంకల్పం భగవంతుడు ప్రసాదించిన వరమని అయోధ్య పండితులు మున్నిద్ ఫలహారి మహరాజ్ అన్నారు. గ్రామంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో ఇటీవల నిర్మించిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో 40 రోజులుగా రుద్రాభిషేకాలు జరుపుతున్నారు. స్వామి మాలధారణ భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. పూజా కార్యక్రమాల్లో కాపుశెట్టి నీలమణి, మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కోఆపరేటివ్ సొసైటీగా సబ్బవరం పీఏసీఎస్



పురస్కారాన్ని అందుకుంటున్నగొంప రమణ

సబ్బవరం: రాష్ట్ర స్థాయి ఉత్తమ కో ఆపరేటివ్ సొసైటీగా సబ్బవరం శ్రీదుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) నిలిచింది. ఏపీ రాష్ట్ర కో అపరేటీవ్ సొసైటీ బ్యాంక్ 62 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్తమ సహకార సంస్థలను ఎంపిక చేశారు. ఇందులో 2023–24 ఏడాదికి ఉత్తమ సొసైటీగా ఎంపికై అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా సొసైటీ సీఈవో గొంప రమణ ఈ పురస్కారాన్ని అందుకోవడం పట్ల గ్రామస్తులు, సంఘం ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలకు వినతి



ప్లాట్‌లు వేసి విక్రయాలు జరుపుతున్న స్థలం

సబ్బవరం: మండలంలోని ఎరుకునాయుడు పాలెంలో జగనన్న లే అవుట్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ప్లాట్లుగా విభజించి విక్రయాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని అసకపల్లి మాజీ ఉప సర్పంచ్ మొల్లి చిన్నారావు కోరారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో ఎరుకునాయుడుపాలెం రెవన్యూ పరిధి సర్వే నెం.73, 75లలో పేదలందరికీ ఇళ్లు, ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు వీఎంఆర్‌డీఏ ద్వారా లే అవుట్‌లు వేసి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందన్నారు. వీఎంఆర్‌డీఏ నిబంధనల మేరకు సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంపై అక్రమార్కులు కన్నేశారని పేర్కొన్నారు. ఈ భూమికి సర్వే జరిపి, అక్రమార్కుల ప్లాట్లను తొలగించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

రికవరీ వెహికల్స్‌కు పార్కింగ్ నో!



శాంతి భద్రతల పరిరక్షణ.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ.. నేరాల నియంత్రణ పెందుర్తి పోలీస్ యంత్రాంగానికి ఒక సవాల్ అయితే అంతకు మించిన సవాల్ రికవరీ వాహనాల పార్కింగ్. మొదటి మూడింటిని ఏదోలా నెట్టుకొస్తున్నా.. రికవరీ వాహనాల పార్కింగ్ సమస్య మాత్రం వీరికి కొరకరాని కొయ్యగా మారింది. ఏళ్ల తరబడి కొలిక్కిరాని కేసుల్లో ఉన్న వాహనాలతోపాటు, రోజువారీ తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు తాత్కాలిక షెల్టర్ కోసం నానా పాట్లు పడుతున్నారు.



పెందుర్తి జిల్లా పరిషత్ స్థలంలో పార్కింగ్ చేసిన పోలీస్ రికవరీ వాహనాలు

- పెందుర్తి పోలీసులకు వాహనాల పార్కింగ్ తిప్పలు
- రికవరీ చేసిన వాహనాల్ని భద్రపరిచేందుకు పాట్లు
- స్టేషన్‌కు సమీపంలో ఏళ్ల తరబడి ఇతర స్థలాల్లో తిష్ట
- స్థలాభావంతో 3 కి.మీ. దూరానికి వాహనాల తరలింపు



పురుషోత్తపురంలోని వివాదాస్పద స్థలంలో పార్కింగ్ చేసిన పోలీస్ రికవరీ వాహనాలు



రెవెన్యూ కార్యాలయం వద్ద సీజ్ చేసిన వాహనాల పార్కింగ్

పెందుర్తి: గంజాయి, ప్రమాదాలు, ఇతర కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఉంచేందుకు స్థలం లేక పెందుర్తి పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతి నెలా స్టేషన్లకు చేరుతున్న వాహనాల సంఖ్య పెరుగుతోంది. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద కనీసం సిబ్బంది వాహనాలను పార్కింగ్ చేసుకునే వెసులుబాటూ అరొకొరేనంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. దీంతో ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన స్థలాల్లో వాహనాలను ఉంచాల్సిన దుస్థితి. ఈ క్రమంలో ఆయా శాఖల నుంచి తిరస్కరణ ఎదురైన ప్రతిసారీ కథ మళ్లీ మొదటికే వస్తోంది.

నిత్యం వాహనాల తాకిడి

పెందుర్తి పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధి చాలా ఎక్కువ. ఇటు ముదపాక శివారు నుంచి అటు నరవ శివారు వరకు పెందుర్తి సర్కిల్ ఉంది. ఈ క్రమంలో స్టేషన్‌కు వివిధ కేసులు, ఇతర అంశాలపై నిత్యం వందలాది మంది వస్తుంటారు. అదే సమయంలో నేరాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, గంజాయి కేసుల్లో రోజుకు సగటున పదికి పైగా వాహనాలను పోలీసులు రికవరీ చేస్తుంటారు. అందులో కొన్ని తక్కువ రోజుల వ్యవధిలోనే యజమానులకు అప్పగించినా.. కోర్టు కేసుల్లో ఉన్న వాహనాలను ఇక్కడే ఉంచాలి. చాలా కేసులు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకపోవడంతో కొన్ని భారీ వాహనాలతో పాటు ఆటోలు, బైక్‌లతో పోలీస్ స్టేషన్ ప్రాంగణం నిండిపోతోంది.

పరాయి స్థలాలపై ఆధారం

పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరిన వాహనాలను పార్కింగ్ చేసేందుకు సొంతంగా స్టేషన్‌కు స్థలం లేకపోవడంతో పక్కనే ఉన్న జిల్లా పరిషత్ స్థలంలో చాలాకాలంగా వాహనాలను ఉంచుతున్నారు. అయితే కేసుల తాకిడితో ఆ ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. దీంతో రోడ్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని వాహనాలను పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ప్రభుత్వాస్పత్రి వద్ద ఉంచుతున్నారు. చాలా వాహనాలను రోడ్లకు ఇరువైపుల పార్కింగ్ చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

జెడ్పీ స్థలంపై పంచాయితీ!

అందుబాటులో ఉన్న ఆ స్థలాలు కూడా సరిపోకపోవడంతో స్టేషన్‌కు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పురుషోత్తపురంలోని జిల్లా పరిషత్ స్థలాన్ని ఇటీవల ఆశ్రయించారు. గోరు చుట్టుపై రోకలి పోటు చందంగా ఆ స్థలంపై సింహాచలం దేవస్థానానికి, జిల్లా పరిషత్‌కు మధ్య వివాదం ఉండడంతో పోలీసు వాహనాల పార్కింగ్ మళ్ళీ మొదటికొచ్చింది. పార్కింగ్ కోసం ఇన్నిపాట్లు పడడం కంటే ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పోలీస్ రికవరీ వాహనాలకు ప్రత్యేకంగా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం చూశాం



పోలీస్ స్టేషన్‌కు వివిధ కేసుల్లో తీసుకువస్తున్న వాహనాల పార్కింగ్‌కు స్థలాభావం మాట వాస్తవమే. అయితే వాహనాల పార్కింగ్‌కు వేరే చోట ప్రత్యామ్నాయ స్థలం తీసుకున్నాం. ప్రభుత్వ విభాగాల మధ్య స్థలం గురించి వివాదాల సంగతి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. దానికి తగ్గట్లుగా ఆయా విభాగాల అధికారులను అనుమతి కోరుతూ లేఖలు కూడా రాశాం. అనుకూలంగా అనుమతులు వస్తాయని భావిస్తున్నాం.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

పీజీఆర్ఎస్‌కు 17 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 17 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ 'బాక్సింగ్' పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు

పరవాడ: విశాఖపట్నంలో గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆర్.యువరాజ్, కె.కోవిద, కె.హర్షితలు జాతీయ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. ఈ నెల 6 నుంచి 13 వరకు ఉత్తర్‌ప్రదేశ్ నోయిడాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులతో పాటు కోచ్‌లు అమర్‌నాథ్, అన్నపూర్ణలను పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి, సీఈవో కె.నిశాంత్‌లు సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని అభిలషించారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులతో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న బాటజంగాలపాలెం అంగన్‌వాడీ సిబ్బంది



నాయుడుపాలెంలో వారోత్సవాల్లో మాట్లాడుతున్న సర్పంచ్ వరలక్ష్మిసీతారామయ్య

సబ్బవరం: తల్లి పాలలోనే అన్ని రకాల పోషక విలువలు ఉంటాయని, బిడ్డకు పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకూ తల్లిపాలను మాత్రమే తాగించాలని సర్పంచ్ పడాల వెంకటరమణ సూచించారు. మండలంలోని బాట జంగాలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని, మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యతకను బాలింతలకు, గర్భిణులకు వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శాంతికుమారి, ఏఎన్ఎం ఉమామహేశ్వరి, ఎంఎస్‌కే శశికళ, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తాయని నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య అన్నారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని, మాట్లాడారు. తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా తల్లీ బిడ్డల మధ్య ప్రేమానురాగాలు పెంచుతాయన్నారు. బిడ్డకు పాలుపట్టే తల్లి రొమ్ము క్యాన్సర్ బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. పోతపాలతో బిడ్డకు శరీరం పెరగడం తప్ప, తెలివితేటలు రావన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా వీవోఏలు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా జరిపారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులందించారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరిక
- కార్డన్ సెర్చ్‌లో బెల్ట్ దుకాణంలో మద్యం పట్టివేత



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో కార్డన్ సెర్చ్‌లో యువకులతో మాట్లాడుతున్న కలిగిస్తున్న పోలీసులు

పెందుర్తి: నేర ప్రవృత్తి కలిగిన ప్రతీ ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 96వ వార్డు రాచ్చెరువు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సోమవారం ఉదయం 5.30 నుంచి 7.30 వరకు 20 మంది బృందంతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అడుగడునా క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగా లేని 11 వాహనాలను సీజ్ చేశారు. కాలనీలోని పాన్‌షాప్‌లో మద్యం బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నిల్వ ఉన్న 4 బీర్ బాటిళ్లు, 11 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల గురించి ఆరా తీయాలని సూచించారు. అలాంటి వ్యక్తుల వాహనాలను, ఇతర సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించాలని కోరారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో అనుమానానస్పద ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎస్ఐలు స్వామి నాయుడు, ఎన్వీ భాస్కరరావు, ఏఎస్ఐ కాశీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేసిన విద్యార్థులతో ఆదర్శ్ కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విద్యార్థుల నుంచి చక్కటి స్పందన లభించింది. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, విశాఖ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 11 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్ఈ ఫ్లోరా, విశాఖ బ్లడ్ బ్యాంక్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్ రవిశంకర్, వైద్యాధికారి ప్రజ్ఞత, సిబ్బంది నాయుడు, అనూష, శ్రీను, గౌరీ, సునంద, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మంజుల, సంధ్యారాణి, రాజ్‌కుమార్, రవిబాబు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత బాల ఆదిత్యరెడ్డికి బాండ్ అందిస్తున్న ఈవో త్రినాథరావు



చెక్కు అందిస్తున్న దాత సూర్యప్రకాశరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి తగరపువలసకు చెందిన ఉప్పాడ బాల ఆదిత్యరెడ్డి రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో మంగళవారం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు ఈవో వి.త్రినాథరావు బాండ్ అందించారు. అలాగే నగరంలోని మహారాణిపేటకు చెందిన కె.సూర్యప్రకాశరావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని చెక్కురూపంలో పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. కార్యక్రమంలో పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. రక్షించిన పోలీసులు

పెందుర్తి: కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ మహిళను పెందుర్తి పోలీసులు సకాలంలో స్పందించి, చాకచక్యంగా కాపాడారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పెందుర్తి సమీపంలోని సూర్యనగర్‌లో నివాసం ఉంటున్న ఎల్.శశిలేఖ(31)కు భర్తతో తరచూ గొడవలు జరిగేవి. ప్రతి చిన్న విషయానికి తగాదాలాడుకునే పరిస్థితి. ఈ క్రమంలో సోమవారం కూడా ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గదిలోకి వెళ్లి తలుపు వేసుకుని, ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు ఎంతగా తట్టినా స్పందించలేదు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెంటనే అక్కడికి చేరుకున్న హెచ్‌సీ అప్పారావు, బ్లూ కోట్స్ పీసీ చంద్రశేఖర్ తలుపులు విరగ్గొట్టి శశిలేఖను కాపాడారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి, భర్తను పిలిపించి మందలించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.60 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పీఏసీఎస్‌లో జేఎల్‌జీ రుణాల పంపిణీ



రుణం సొమ్ము అందిస్తున్న అయిత సింహాచలం

పెందుర్తి: పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో జాయింట్ లైబిలిటీ గ్రూప్ రుణాలతో పాటు వ్యవసాయ, బంగారంపై రుణాలు, వ్యక్తిగత రుణాలను మంజూరు చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అయిత సింహాచలం(సింహా) చేతుల మీదుగా ఆయా రుణ నగదును లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా అయిత మాట్లాడుతూ పీఏసీఎస్ వినియోగదారుల సంక్షేమం కోసమే తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తుందన్నారు. పీఏసీఎస్ కార్యదర్శి శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు జాడ లేక.. చుక్క నీరు కానక

ఎన్నో ఆశలతో ఖరీఫ్‌కు సిద్ధమైన రైతాంగానికి వరుణుడు ముఖం చాటేశాడు. గత నెలన్నర రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతల గుండెల్లో గుబులు రేగుతోంది. వర్షాల్లేక వ్యవసాయ బావులు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. ఏటా ఆగస్టు నాటికి నిండుకుండను తలపించే మేహాద్రి రిజర్వాయర్ సైతం నోరెళ్లబెట్టింది. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా వరినారు వేయడంతో చినుకు జాడలేక వడలిపోతోంది. నారును బతికించుకోవడానికి రైతులు మోటార్లు, బిందెలతో నీరు మోసి తడుతుపుతున్నారు. మరోవారం రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది ఖరీఫ్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని వాపోతున్నారు.

– పెందుర్తి





పెందుర్తిలో నీరు లేక వెలవెలబోతున్న బసవనాయుడు చెరువు (ఇన్‌సెట్) వర్షాల్లేక పూర్తిగా ఎండిపోయిన వరినారు